దిశానిర్దేశం

చేవెళ్ల రూరల్, జనవరి 21 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలిపేలా శక్తివంచన లేకుండా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. మాజీ మంత్రిని కలిసినవారిలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాజు, మాధవ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఆరిఫ్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో చందాలు, వసూళ్లు

షాద్‌నగర్ గ్రంథాలయ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

షాద్‌నగర్, జనవరి 21 : కాంగ్రెస్ పాలనలో గ్రంథాలయాలను చందాలకు, అక్రమ వసూళ్లకు వినియోగించుకున్నారే తప్పా, ఏనాడు కూడా గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేయలేదని షాద్‌నగర్ గ్రంథాలయ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని గ్రంథాలయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. బీఆర్ఎస్ పాలన కంటే మునుపు షాద్‌నగర్ గ్రంథాలయాన్ని అప్పటి కాంగ్రెస్ నేతలు వసూళ్లు, చందాలకు, తమ రియల్ ఎస్టేట్ అడ్డాకు వినియోగించుకున్నారే తప్పా, ఏనాడు కూడా గ్రంథాలయాల ప్రగతికిగానీ, పాఠకులకు మెరుగైన సేవలను అందించాలనే బుద్ధితో పనిచేయలేదని మండిపడ్డారు.

కోట్లు ఖర్చు చేసి గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

షాద్‌నగర్ గ్రంథాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు గ్రంథాలయాల అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదని చెప్పడం సరికాదన్నారు. పాత భవనం కూలిపోయే స్థితిలో ఉన్నా, వర్షానికి పుస్తకాలు తడుస్తున్నా అప్పటి కాంగ్రెస్ నేతలు కనీస చర్యలు తీసుకోలేదన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక షాద్‌నగర్‌లో రూ.4 కోట్లను వెచ్చించి నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించామని, కొందుర్గులో రూ.2 కోట్లు, చౌదరిగూడలో రూ.2 కోట్లు, నందిగామలో రూ.1.60 కోట్లు, కొత్తూరు మున్సిపాలిటీలో నిర్మించే భవనానికి రూ.98 లక్షల నిధులు అప్పట్లోనే మంజూరు చేశారని వివరించారు. కేశంపేటలో రూ.10 లక్షలను వెచ్చించి భవన మరమ్మతు పనులను చేయించామన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలను సమకూర్చామని, షాద్‌నగర్ గ్రంథాలయం నుంచి రెండు వేల పుస్తకాలను ఖైదీల మార్పు కోసం జైలు అధికారులకు అందజేశామని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు, అభ్యర్థులకు విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రంథాలయ పాలక మండలి ఎంపికలో ఎలాంటి వ్యక్తిగత ఆలోచన చేయలేదని, ఉద్యమంలో పనిచేసిన వారిని గుర్తించి పదవులను ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం మానుకొని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మాజీ సభ్యులు సుధాకర్, మహేశ్వర్, జంగరాజు, జగన్, సలీం పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోస్

ప్రభుత్వ దవాఖాన సందర్శన

వికారాబాద్, జనవరి 21 : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానను భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభాగం సీనియర్ ప్రాంతీయ సంచాలకులు (సీనియర్ రీజినల్ డైరెక్టర్) డాక్టర్ అనురాధ మెడోస్ పరిశీలించారు. వికారాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులతో జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన జాతీయ కీటక జనత వ్యాధుల నియంత్రణ, మాతా శిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ, జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం అమలు, అందుకు సంబంధించిన నిధుల విడుదల, ఖర్చులు వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు, వాటి ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రవీంద్రయాదవ్, జీవరాజ్, ప్రోగ్రాం అధికారులు పవిత్ర, బుచ్చిబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ దవాఖానను సందర్శించి అక్కడ అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు. మరో రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించి ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్‌లలో కొన్నింటిని తనిఖీ చేయనున్నారు.

ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

వికారాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 21 : ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్లకు ఆయుధాలుగా మారుతాయని వికారాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని ఆశపెడుతారన్నారు. రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజల నుంచి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంత మందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజలను మభ్యపెట్టే కొత్తకొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తుంటారన్నారు. ఇలాంటి నూతన స్కీంల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. మనల్ని నమ్మించి, మభ్యపెట్టి, వంచించి మన దగ్గర, మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే వారి పనిగా పెట్టుకుంటారని తెలిపారు. మన ఆశ, అత్యాశ వారి ఆయుధాలు కాబట్టి.. ఇలాంటి నేరాల పట్ల, మొబైల్ ఫోన్లను చూసే మనకు ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఈమెయిల్, ఫోన్ కాల్‌ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఈ కుట్రలకు ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగకుండా అన్ని జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. మోసపోతే ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా టోల్‌ఫ్రీ నం.1930కి గానీ, www.cybercrime. gov.in ద్వారా, సమీప పోలీస్‌స్టేషన్‌లోనైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

గ్రామసభల్లో గందరగోళం

- అధికారులను నిలదీసిన గ్రామస్తులు
- విడుదల చేసిన జాబితాపై లబ్ధిదారుల అసంతృప్తి
- సగం మందికి కూడా పథకాలు మంజూరు కాలేదని ఆవేదన
- అర్హులను ఎంపిక చేయని గ్రామసభలు ఎందుకని ప్రశ్నించిన జనం
- ఏడాది గడిచినా పేదలకు సక్రమంగా అందని సంక్షేమ పథకాలు
- గ్రామసభల్లో పాల్గొన్న తాండూరు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు
- సమస్యలపై సమాధానమివ్వకుండా దాటవేసిన వైనం
- ప్రజలు తిరగబడడంతో నివ్వెరపోయిన అధికారులు, నాయకులు
- పోలీసుల బందోబస్తు మధ్య సభలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా తయారయ్యాయి. పోలీసుల బందోబస్తు మధ్య సభలు నిర్వహించారు. దరఖాస్తులు చేసుకున్నవారిలో కొంతమందికే పథకాలకు ఎంపిక చేశారని అధికారులపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదివరకే లబ్ధి పొందుతున్నవారికే తిరిగి ఎందుకు పథకాలు వర్తింపజేశారని నిలదీశారు. అర్హులను ఎంపిక చేయని గ్రామ సభలు ఎందుకని ప్రశ్నించారు. ఏడాది గడిచినా పేదలకు సక్రమంగా పథకాలు అందడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను నిలదీయడంతో అధికారులు, నాయకులు నివ్వెరపోయారు.

ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

పోలీసు బందోబస్తుతో ప్రజాపాలన గ్రామసభ

మంచాల : లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో అధికారులను వివిధ పార్టీల నాయకులు నిలదీశారు. ఇందిరమ్మ కమిటీలో సభ్యులుగా ఉన్న కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు.. ఇందిరమ్మ ఇండ్లు తాము చెప్పినవారికే వస్తాయంటూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. అసలు లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేస్తారా లేక ఇందిరమ్మ కమిటీలో ఉన్న కాంగ్రెస్‌వారు ఎంపిక చేస్తారా అంటూ ప్రజాపాలన గ్రామ సభలో సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. మంచాల మండలం లింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యాయలం ఎదుట ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం రూ.2600 చెల్లిస్తుందని చెప్పడంతో.. గ్రామంలో భూమిలేని వారి కొంతమంది పేర్లు మాత్రమే సేకరించి అధికారులు చేతులు దులుపుకొన్నారని ఇదెక్కడి న్యాయమంటూ వారు ప్రశ్నించారు. గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారందరూ గతంలో దరఖాస్తులు చేసుకున్నా కూడా అవి ఎటుపోయాయని అధికారులను నిలదీశారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయనుకుంటే అధికారులు మాత్రం తూతూమంత్రంగా గ్రామ సభల్లో లిస్టులో ఉన్న పేర్లను చదివి గ్రామ సభను ముగించడంతో ఈ సభ ఎవరికి ఉపయోగపడిందని వారు ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న డ్రామా అని.. దీనివల్ల ప్రజలకన్నా నాయకులకే ఉపయోగం ఉందని వారు పేర్కొన్నారు.

ప్రశ్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు

ప్రజాపాలన గ్రామ సభలో నాలుగు సంక్షేమ పథకాలపై సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు జంగయ్య, కిషన్‌రెడ్డి, పరమేశ్ అర్హులైన వారి జాబితాను చదివి వినిపించాలని అధికారులను నిలదీశారు. దీంతో పక్కనే ఉన్న మంచాల పోలీసులు వారి వద్దకు వచ్చి మైకును లాక్కోవడమే కాకుండా సమస్యను అడగకుండా అడ్డుపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నిర్వహిస్తున్న ఈ సభ ఎవరికి ఉపయోగపడిందని.. సమస్యను అడిగితే అడ్డుకోవడమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నివ్వెరపోయిన అధికారులు, నాయకులు

పెద్దేముల్ : మండల పరిధిలోని గాజీపూర్, పెద్దేముల్, గోపాల్‌పూర్, నాగులపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సభలో అధికారులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను అధికారులు తెలియజేస్తుండగా ఒక్కసారిగా ప్రజలు లబ్ధిదారుల ఎంపిక విధానం సరిగ్గా జరుగలేదని, కేవలం ఉన్నవాళ్లకే మళ్లీ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తారా అని అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యే కల్పించుకొని చెప్పినా ప్రజలు శాంతించలేదు. గెలువక ముందు ఒక మాట.. గెలిచాక ఇంకో మాట మాట్లాడుతారా అంటూ ప్రజలు తిరగబడ్డారు. దీంతో అధికారులు, నాయకులు నివ్వెరపోయాయ. అంతా తప్పులతడకగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని.. తిరిగి సరైన రీతిలో ఎంపిక చేసి గ్రామాల్లోకి రావాలని ప్రజలు కోరారు.

అపహాస్యంగా గ్రామసభ

ఆమనగల్లు : మండలంలోని కోనాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటయ్య ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలుపకుండా, కొత్త దరఖాస్తులు తీసుకోకుండా గ్రామపంచాయతీకి తాళం వేశాడు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ దరఖాస్తులు తీసుకునే సమయంలో ఓ రాజకీయ పార్టీ నాయకులతో కలిసి ఓ దాబాలో కూర్చొని ప్రభుత్వ పథకాలు నేనే ఇప్పిస్తానని లంచంగా డబ్బులు ఇవ్వాలని బేరసారాలు జరిపినట్లు గ్రామ ప్రజలు ఆరోపించారు. ఇలాంటి అధికారులపై ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు బహిరంగాగానే అంటున్నారు.

ఉన్నవారికే పథకాలు మంజూరు

కొడంగల్ : కొడంగల్ మున్సిపల్ పరిధి 2వ వార్డు, 8వ వార్డు తదితర వార్డుల్లో గ్రామ సభలు జరిగాయి. కొడంగల్ మండల పరిధిలో పోచమ్మతండా, చిన్ననందిగామ, హుస్సేన్‌పూర్, సంగాయిపల్లి, పలుగుర్రాళ్ల తండా, బోయపల్లితండా, అన్నారం, అప్పాయిపల్లి., బొంరాస్‌పేట మండల పరిధిలో సాలింగాపూర్, మదన్‌పల్లితండా, చౌదర్‌పల్లి., దుద్యాల మండలంలో ఈర్లపల్లి, లగచెర్ల, అల్లిఖాన్‌పల్లి, సాగారంతండా, ఎక్కచెరువుతండాల్లో గ్రామ సభలు జరిగాయి. గ్రామ సభల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి ఎంపికైన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. దీంతో పథకాలకు ఎంపిక కాని లబ్ధిదారులు అధికారులను నిలదీసి, మేం పథకాలకు అర్హులం కాదా.. ఉంటే ఎందుకు ఎంపిక కాలేదని వాగ్వాదం చేశారు. కొన్ని చోట్ల ఉన్నవారికే పథకాలు మంజూరయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక మాత్రమే జరిగింది, పథకాలు మంజూరు కాలేదని అధికారులు సమాధానమిచ్చారు.



పోచమ్మతండాలో అధికారులను ప్రశ్నిస్తున్న బీనీబాయి

ఇష్టం వచ్చినవారికే లబ్ధి

లబ్ధిదారులు మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు అందిస్తేనే ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయని అప్పట్లో చెప్పడం జరిగిందని, దాంతో ప్రజాపాలన కార్యక్రమంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. కాగా ప్రస్తుతం విడుదలైన జాబితాలో చాలా వరకు పథకాలు అనుభవిస్తున్నవారే మళ్లీ ఎంపికయ్యారని మండిపడ్డారు. ఏండ్ల కాలంగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని, ఎంపిక ప్రక్రియలో అధికారుల నిర్ణయాన్ని తప్పుబట్టారు. అధికారుల చేపట్టిన సర్వే ప్రక్రియ సరిగ్గా లేదని, ఇష్టం వచ్చిన వారికే పథకాలు మంజూరు చేసినట్లుగా సర్వే స్పష్టం చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల్లో సగం కూడా ఎంపికకు అర్హత సాధించలేదని, ఎంపిక ప్రక్రియ ఏవిధంగా చేపట్టారని అధికారులను నిలదీశారు. ఎంపిక కాని లబ్ధిదారులను మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారని, గతంలో అందించిన ధరఖాస్తులు ఏమైనట్లో అధికారులు సమాధానం ఇవ్వాలని లబ్ధిదారులు పట్టుబట్టారు. ప్రభుత్వం పథకాల అమలులో జాప్యం చేసేందుకు మాత్రమే ఈ విధంగా సర్వేలు, గ్రామ సభలు అంటూ కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. ఇచ్చిన హామీ ప్రకారం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆత్మీయ భరోసా పథకంపై ఎమ్మెల్యే, అధికారులను నిలదీస్తున్న చర్లపటేల్‌గూడ గ్రామస్తులు

ప్రభుత్వంపై ఆగ్రహజ్వాల

ఇబ్రహీంపట్నంరూరల్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ ప్రజలు నిలదీశారు. మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సమస్యలు పరిష్కరించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పలువురు మహిళలు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో రేషన్ కార్డుల కోసం పంచాయతీ కార్యదర్శి మరోసారి ఇంటింటికీ తిరగాలని ఆదేశించారు. నాలుగు రోజుల్లో గ్రామంలోని 650 ఇండ్లకు సంబంధించి పూర్తి సర్వే నిర్వహించి, అందరికీ రేషన్ కార్డులు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందజేస్తామని ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తుల్లో అవకతవకలు జరుగుతున్నాయని.. 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసి భూమిలేని పేదలకు అందిస్తామని అధికారులు చెప్పి, భూమి ఉన్నవారి పేర్లు కూడా చేర్చారని గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి గ్రామసభలో నిలదీశారు. అవకతవకలకు తావులేకుండా అసలైన భూమి లేని నిరుపేదలకు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించాలని పలువురు డిమాండ్ చేశారు. తుర్కగూడ, కప్పాడు, ముకునూరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరిగి మరోసారి పూర్తి సర్వే చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడమేంటని గ్రామపంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఉన్న పనులతోనే సతమతమవుతున్న తమపై అదనపు భారం పెట్టడమేంటని ఆరోపిస్తున్నారు.

అన్నింటా అవకతవకలే..

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజా పాలనలో మంచి జరుగుతుందని అనుకున్నాం కాని అర్హులైన వారికే అన్యాయం జరిగిందని గ్రామ సభల్లో అధికారులపై ప్రజలు తిరగబడ్డారు. మండలంలోని అబ్దుల్లాపూర్, గండిచెరువు, లష్కర్‌గూడ, బలిజగూడ, పిగ్లీపూర్ గ్రామాల్లో గ్రామ సభల్లో ఆయా పంచాయతీల్లో పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లను కార్యదర్శులు ప్రత్యేక అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. గండిచెరువు గ్రామానికి చెందిన పూజారి రాజు అంధుడు. రేషన్ కార్డులో తమ కుమారుడి పేరును పొందుపర్చాలని గత 10 సంవత్సరాలుగా తిరుగుతున్నా న్యాయం జరుగలేదని, ప్రజా పాలనలో అర్హులైన వారి పేర్లు రాకుండా అనర్హుల పేర్లు ఎక్కువగా వచ్చాయని అధికారులకు తెలిపారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు. రేషన్ కార్డుల లిస్టులో బంగ్లాలు, కార్లు ఉన్నవారి పేర్లు మాత్రమే వచ్చాయని.. ఏమీలేని పేద వారి పేర్లు రాలేదని మహిళలు మండిపడ్డారు. దీంతో సభ గందరగోళంగా మారింది. అక్కడే ఉన్న పోలీసులు ప్రజలను సముదాయించారు. తమ గ్రామంలో సమగ్రంగా ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన వారి పేర్లను నమోదు చేసుకొని న్యాయం చేయాలని అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పేరు లిస్టులో రావడమంటే అధికారుల పని తీరు ఏ విధంగా ఉందో అర్థమవుతున్నదని, అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతోనే అర్హులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

గండిచెరువు గ్రామ సభలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఇంద్రసేనారెడ్డి

లష్కర్‌గూడ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు

రసాభాసగా లష్కర్‌గూడ గ్రామసభ

లష్కర్‌గూడ గ్రామసభ రసాభాసగా మారింది. ఇందిరమ్మ కమిటీల పేరుతో అర్హులైన వారికి అన్యాయం జరిగిందని సభలో గొడవను తలపించేలా ఓ మహిళా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తల్లీతండ్రి లేని అనాథను.. ఇప్పటికీ రేషన్ కార్డులేదు, ఫించన్ రాలేదు.. నా బాధ ఎవరికి చెప్పాలంటూ అధికారుల ముందు కన్నీరు పెట్టుకుంది. ఉపాధి హామీ పథకంలో పని చేయకుండా ఇంటి వద్ద ఉన్నవారి పేర్లు రాశారని, పనిచేసిన వారి పేర్లు ఎందుకు రాలేదని మరో మహిళ అధికారులను నిలదీసింది. జాబితాల్లో పేర్లు రానివారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, ప్రత్యేక అధికారులు ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీవో మధుసూదన్‌చారి, సీడీపీవో రేణుక, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, బబిత, రహీంపాషా, మైథిలి, రాజశేఖర్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- గొట్టిముక్కుల గ్రామ సభలో పాల్గొని పథకాలపై వివరణ

వికారాబాద్ : గొట్టిముక్కుల గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 21 : సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రతా(రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకూ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు ఇస్తుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామ సభ వీటికి ఆమోదం తెలిపింది. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుంచి కూడా అర్జీలు స్వీకరిస్తామన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభల్లో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు మండల కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. గ్రామసభలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీ మధుకర్ రెడ్డి, స్